పజిల్స్

శ్రీ చందూరి నాగేశ్వరరావు

స్వతహాగా వెంకట్రావుకి అట్టే ఆలోచించడం అంటే గిట్టదు. చాలావిషయాలు అతను కొలతబద్దల లాటి తన సిద్ధాంతలతో అటో యిటో తేల్చేస్తూ వుంటాడు. అంచేత అన్ని డిక్షనరీలమధ్యకూచుని దారుణంగా ఆలోచిస్తున్న వెంకట్రావుని చూడగా నాకు ఆశ్చర్యం కలగడంలో వింతలేదు.

“ఏమిటీ అట్టహాసం అంతా?” అని అడిగాను.

“‘లింక్సు’ లో తప్పులురాకుండా వుండేందుకు ఎనిమిది ఎంట్రీలు పంపుతున్నాను. దీనికూడా ‘ఛాయిస్’ యివ్వాలంటే పదహారు పంపవలసివస్తుంది.”

తీక్షణంగాచూశాను, సుడిగుండాలవంటి ఆచద రాలవైపు.

“ప్రయిజ్ ఎంత?” అన్నాను.

“ఎంతలే! అయిదువేలు.”

పాపం! ఇంతే!!

“ఆ మొత్తం అంతా నీకే వస్తుందనా నీ నమ్మకం?” అని అడిగాను.

“నా ఒక్కడికీ కాకపోతే, యిద్దరికి. పోనీ ముగ్గురికి అందాం. లేదా, నలుగురికి చూడు. నలుగురి కయినా ఒక్కొక్కరికి పన్నెండువందల యాభై వస్తుంది.”

నాకు పజిల్స్ అన్నా, థర్డ్ఫారంలో నా చేత గుంజీలు తీయించిన మాస్టరన్నా పరమ ద్వేషం. నా చెయ్యిచూసిన ప్రతి హస్తసాముద్రికుడూ నాచేతిలో అదృష్టరేఖవుందనీ, సిరి ఏ నాడో ఉప్పెనలా వచ్చి పడుతుందనీ, యుద్ధసమయాలలో ఫ్రాంటియర్సు కాపాడేటంత జాగ్రత్తగా వుండవలసిందనీ వాదిస్తూ వుండేవాడు. ఇప్పుడూ హస్తసాముద్రికులు అలాగే అంటారు. కాని మర్యాదగా బతికేందుకు పెద్దమనిషి తరహాకంటె కొంత కృత్రిమం ముఖ్యావసరమని తెలియని ఆరోజుల్లో వాళ్ల డంభాలలో కొద్దిపాటి నిజమైనా వుండకపోతుందా అనుకొనేవాణ్ణి. ప్రపంచంలో పజిల్స్ ముఖ్యంగా క్రాస్వర్డ్ పజిల్స్-అంటే నాకు వుండేవెర్రి వ్యామోహం కొత్తగా కాపరానికి వచ్చిన భార్యమీదకూడా ఏభర్తకీ వుండదు. సుమారు నాలుగైదువందల రూపాయిలు ఫక్తు పజిల్స్కిగాను తగలేశాను; వ్రాతకి ఎంతమాత్రం అనుకూలంకాని ఒక ఫవుంటెన్ పెన్ బహుమతిగా పొందగలిగాను.

చూస్తూ చూస్తూ వుండగా వెంకట్రావు—నాకు కావలసినవాడూ, యిబ్బంది పడుతున్నప్పుడల్లా సహాయంచేసే సహృదయుడూ—గోతిలోపడిపోవడం నాకు ఈషణ్మాత్రమూ మనస్కరించలేదు. పజిల్స్ జూదమని నేను అననుగాని, జూదగాడిలోవుండే Tendencies కాంపిటేటర్లో పుట్టించగలిగే సామర్థ్యం వాటికి వుందని విశ్వసిస్తాను.

“వెంకట్రావ్, నువ్వు ఈ ధోరణిలో పడ్డావేమిటి?”

“ఏం?”

“ధనార్జనకు యిదో ఉపాయం అనుకున్నావా?”

“కాదు...కాదులే...” అన్నాడు, చిరాకుగా.

అతను యింకా ఎక్కువగా చీకాకు పడతాడనీ, తన ఉత్సాహానికి భంగం కలిగించినందుకు నన్నూ నా పితృదేవతలనూ మనస్సులో తిట్టుకుంటాడనీ నాకు తెలుసు. అయినా వక్రమార్గాన్ని పోబోతున్న మిత్రుణ్ణి మంచిదారిలోకి తీసుకురావడం నావిధికాదూ!

“పజిల్స్కీ, నల్లమందుకీ ఎంతో వారలేదు.” అన్నాను. నాపలుకులు అతని కర్ణరంధ్రాలలోకి చొరలేదు.

"ఇదిగో, బ్రదర్, మన జీవితాన్ని నడిపేది (Guide) సహధర్మచారిణియా లేక విధియా (Mate or Fate) పొద్దుట్నుంచీ ఆలోచిస్తున్నాను. కాని ఆలోచన తెగడంలేదు."

'ఈ గర్భిణీస్త్రీకి ఆడపిల్ల కలగవచ్చును. తప్పితే నిస్సందేహంగా మొగపిల్లవాడు' అని చెప్పిన జ్యోతిష్కుడిలా మాట్లాడాను. పజిల్స్‌కి ఒక ఆకర్షణశక్తి వుంది, దగ్గరలోవుండి తమమీద ఏమాత్రం అభిమానం చూపుతున్నా సరే తమలోకి లాగేసుకొని అధఃపాతాళంలోకి అణగదొక్కేస్తాయి.

వెంకట్రావుకి పావుగంటసేపు నీతులు బోధించాను. నాబాణాలన్నీ మధ్యలోనే తుత్తినియలై పోయినై. నాలో తాంత్రికశక్తిగానీ, మాంత్రికశక్తిగానీ, ఆధ్యాత్మికశక్తిగానీ, మరింకే యితరశక్తిగానీ లేకపోవడంచేతనే నా పవిత్రప్రయత్నంలో జయంపొందలేకపోయాను. ఆరోజు ఆఫీసుకి సెలవుపెట్టి నిరశనవ్రతదీక్ష పూనుతానని బెదిరించి, ఉపవాసంచేసివుంటే ఫలితం ఎలా వుండేదో చెప్పలేను.

నేను వోడిపోయాను. తెలివితేటలనూ అయిదు రూపాయిలనూ జతచేసి, ఎంతతేలికగా చూసినా ఒక వెయ్యిరూపాయిలపాటి లబ్ధి అయినా పొందాలని వెంకట్రావు సంకల్పం.

నీవు "సులభంగా వెయ్యిరూపాయిలు వస్తా యని త్రికరణశుద్ధిగా నమ్ముతున్నావు కనక అయిదు రూపాయిలకు ఇంకో అయిదురూపాయిలు కలిపి పది రూపాయిల ఎంట్రీఫీజుతో Fate Mate "కాంబినేషన్' కూడా పంపు" అని సలహా యిచ్చాను.

ఎంచేతనో, వెంకట్రావుకు నాసలహా నచ్చలేదు. నేను ఎగతాళి చేస్తున్నానేమో అనే శంకతో నావంక వోరకంట చూశాడు. కాని నన్ను గురించి ఆలోచించేందుకు అతనికి వ్యవధిలేదు; Fate Mate లలో ఏదో ఒకటి తేల్చేయాలి. అవతల ఆఫీసుకి టైమవుతోంది. ఆ పజిల్‌కి 'క్లోజింగ్ డే' కూడా ఆరోజే!

అయిదురూపాయిలు మాత్రమే ఖర్చుచేసి, వెయ్యిరూపాయిలు జేబులో వేసుకోవడంలోనే మొగతనమూ, తన విజ్ఞానానికి తగినప్రతిఫలమూ వుందనీ, పదిరూపాయలు పాడు చెయ్యడం చాలా పొరబాటైన విషయమనీ వెంకట్రావు హెచ్చరించాడు. తొమ్మిది రూపాయల వడ్డీకి షావుకార్లు స్వాతివానకి ముత్యపు చిప్పలలా ఎదురుచూస్తున్న ఈరోజులలో, పదిరూపాయలు మనియార్డరుచేసి వెయ్యిరూపాయిల చెక్కు (వెయ్యికి పైనే అతని లెక్కప్రకారం) అందుకోవడం అసంగతంగా అగుపించింది. మీకూ నాకూ ఆసిద్ధాంతంలో వున్న గొప్పతనం తెలియకపోవచ్చు. కాని, అది వెంకట్రావు సిద్ధాంతం సుమండీ! అయిదు రూపాయిలతో, ఎంత హీనంగా చూసినా, వెయ్యి రూపాయిలు కురవాలి. పదిరూపాయిలతోనా... 'నో' 'నో' 'నో.'

చెడిపోతున్న స్నేహితుణ్ణి చూసి, జాలిపడి, చెడుగులోని మంచి చూపిద్దామనే ఆపేక్షతో Fate, Mate ల గురించి నేనుకూడా ఆలోచించడం ఆరంభించాను.

Mate అంటే సహధర్మచారిణిలాంటిది. జీవితాన్ని Guide చేసేది. నడిపేది, నడిపించేదికూడాను. బాగానే వుంది. జీవితాన్ని guide చేసేది mate అనడంలో పొరబాటు లేదు.

ఇంక Fate. ఈజీవితం అంతా Fate కాక మరింకేమిటి? నేను ఈకథ వ్రాయడం, మీ రిది చదవడం, 'రాత్రి వొంటిగంటదాకా ఏమిటండీ ఆవ్రాత' అంటూ శాంత విసుక్కోవడం, యిదంతా ఏమిటి Fate కాక? సృష్టి స్థితి లయ కారణం Fate అంచేత మన జీవితాన్ని guide చేసేదికూడాను Fate!

ఆలోచించాం. చాలాసేపు ఆలోచించాం సోదహరణాలతో సహా. వేదాంత దృష్టితో వీక్షించాం; సాంసారికదృష్టితో పర్యాలోచించాం. చెట్టు ముందా, విత్తు ముందా?

కాని, ఏది ముందో తేల్చెయ్యాలి. వెంకట్రావు సిద్ధాంతాల ప్రకారం ఒకటి ముందూ, రెండోది తరవాతా అయివుండాలి. పరీక్ష ఫేలయిన కుర్రాడి మొహంలా ఏవిషయమూ కొశ్చన్ మార్కులతో వుండడం అతను సహించలేదు.

'దొర - దొంగ' ఆటలోమాదిరిగా రెండు కాగితం ముక్కలమీద ఆ రెండు మాటలూ వ్రాశాం. ఎగరేశాం. తియ్యగానే Mate వచ్చింది. మళ్లీ రెండు సార్లు చూశాం. తతిమ్మా రెండుసార్లూ Fate వచ్చింది. మెజారిటీ. ఎక్కడయినా అంతే కామా! Fate అని కూపనుమీద వ్రాస్తున్నప్పుడు గడియారం టంగుటంగు మంటూ పదిఘంటలు కొట్టింది.

"విజయసూచకం" అన్నాడు.

"మూఢనమ్మకం" అన్నాను.

కాంపిటేషన్ మేనేజరు సీల్డ్ కూపను ప్రచురిత మయింది. వెంకట్రావు పంపిన ఎనిమిది ఎంట్రీలలోనూ ఒక ఎంట్రీలో ఒకే ఒక్క తప్పు ఉంది. గడియారం జయధ్వానాన్ని సూచిస్తుం దని వెంకట్రావు అపోహ పెండాడు గాని Mate అని కాంపిటేషన్ మేనేజరు జవాబులో ఉంది.

ఈ Fate Mate ల విషయంలో యిద్దరం సద్దులాడుకున్నాం.

"నేను Mate వ్రాయమంటే నువ్వే Fate వ్రాశావు" అన్నాను నేను.

"కాదు, నేను Mate వ్రాయబోతూ వుంటే నువ్వే Fate వ్రాయమన్నావు" అన్నా డతను.

నాది పొరబాటయినా, అతనిది పొరబా టయినా, అతని Fate అలా ఉంది. అయిదువేల రూపాల యోగ్యత లేకపోయింది.

ప్రయిజ్ లిస్టు వచ్చింది. వెంకట్రావు పేరు కూడా వుంది. 'ఆల్ కరెక్ట్'గా ఒక మిస్ పంపించింది. ఆమెకి అయిదువేలు పోగా ఒక తప్పువారు పద ముగ్గురు ఉన్నారు. ఒక్కొక్కరికి రూ ౨౩-౧౫-౨ వచ్చింది.

ప్రయిజ్ లిస్టులో వెంకట్రావు పేరు చూచినపుడు నాకు ఈర్ష్య కలగకపోలేదు. పజిల్స్‌లో ఎంతమాత్రం అనుభవమూ లేని వెంకట్రావు మొట్ట మొదటిసారి సుమారు డెబ్బయినాలుగు రూపాయిలు సంపాయించగలిగితే, యింతో అంతో అనుభవం వున్నవాణ్ణీ, ఆ సాధకబాధకాలు అనుభవించినవాణ్ణీ అయిన నేను......అంకగణితం అదే అరథ్‌మెటిక్ యిక్కడ ఫేలవుతుంది లెండి. ఆవిషయం నేనూ ఒప్పుకుంటాను. ఇలాటి ఈర్ష్యలు పొడసూపితే, వెంకట్రావుసిద్ధాంతరీత్యా వాటిని బైటికి పొసగని య్యకుండా చేసి, మనస్సులోనే కప్పెడుతూ వుండాలి. వెంకట్రావు జయం నాదే అన్నట్లుగా ఎంతో నేర్పుతో నటించగలిగాను.

అతని ఆకస్మిక జయాన్నీ, అదృష్టాన్నీ శాంతా దేవితో చెప్పగా, ఆమె మొహం అంతా కళ్లు చేసు కొని, "అయితే వుండండి, యివ్వాళనుంచి నేను మొద లెడ్తాను, పజిల్స్ సాల్వ్ చెయ్యడం" అంది.

నా గుండెలలో రాయి పడింది. 'కీ' యిచ్చి వదిలిపెడ్తే తనంతట తానే తిరిగే స్ప్రింగు మోటారు లాంటిది శాంతాదేవి.

"శాంతా, స్కూల్ఫైనలు పాసయినంత మాత్రాన పజిల్స్ సాల్వ్ చెయ్యగలవనా నీ నమ్మిక ?"

నా అర్ధాంగి ధరించిన తెల్ల చీరెకీ ఆమె మొహానికీ ఎంతో తేడా కన్పించలేదు.

"ఏం బి. ఎ. పాసయితేగాని పజిల్స్ సాల్వ్ చెయ్యలేరా ?"

"హృదయవికాసమూ, ఆత్మ- ఔన్నత్యమూ, శాస్త్రపరిచయమూ, ప్రపంచజ్ఞాన"మూ...

"ఏమి టవన్నీ !! ఎందుకలా ఏకరువు పెడు తున్నారూ ?"

"అవన్నీ వుండాలి."

"పజిల్స్ సాల్వ్ చేసేందుకా ?"

"అవును."

"వెంకట్రావుకి యివన్నీ ఉన్నాయా ?"

"ఊఁ."

శాంతాదేవి ఒక్కమారు దీర్ఘంగా ఆలోచించి, బూజుపట్టిన దూలాలవైపూ, చిమలు పాకుతూన్న గోడలవైపూ చూస్తూ, "ఏమండీ, మీరు పజిల్స్ సాల్వ్ చెయ్యగలరూ ?" అని అడిగింది.

"ఊఁ" అన్నాను డంబాచారిలా. అంతటితో పూరుకోక, నాఅనుభవాలన్నీ ఆమె వీనులకి విందు గొలిపేటట్లు నివేదించాను.

నా లెక్చరంతా కాలేజీగరల్ వలె కాక ఎంతో శ్రద్ధగా విని, "అయితే, నేను సాల్వ్ చెయ్య గలను,— అవసరమైనపుడు మీ సహాయం వుంటుంది కాదూ!"

ఆకాశం విరిగి నెత్తిని పడ్డట్టయింది. నా చెవులు నన్ను మోసం చేస్తున్నాయేమో అని భ్రమించి, "ఏమిటి?" అన్నాను.

"పజిల్స్ నేనూ సాల్వ్ చేస్తాను," అంది శాంత, ఎంతో ఓర్పుతో.

స్త్రీవిద్యవల్ల కలిగే చిక్కులు అనుభవపూర్వకంగా యిప్పుడిపుడు తెలుస్తున్నాయి. శాంతాదేవిని వాళ్ల వాళ్లు మెట్రిక్యులేషన్ వరకూ చదివించడం పొరబాటేమో అని ఒక క్షణకాలం సంశయించాను. కాని, యిదంతా స్టేషనుకి ఆలస్యంగా వచ్చి తప్పిపోయిన రైలుకోసం విచారించడంలాంటిది.

"శాంతా! నువ్వు ఈ అఖాతంలో పడకు. పజిల్స్ నీబుర్రని పాడుచేస్తాయి. అసలే నీది మైమరపు స్వభావం. పజిల్స్ సాల్వ్ చెయ్యడం ఆరంభించావంటే, కారియర్ భోజనం మనకి ప్రాప్తమవుతుంది."

"మరీ చోద్యంగా చెప్తారు! మొదటి ప్రయిజ్ ఎవరికి వచ్చిందన్నారూ! మిస్ అలివేణికా? ఈమారు శాంతాదేవికేమో!"

వ్యవహారం అప్పుడే ముదిరిపోతోంది. వెంకట్రావు నామాట వినక చెడిపోయాడు. చెడిపోయినా రూ ౭౩-౧౫-౭ వచ్చాయి. కాని, నాకుగాని నా సహధర్మచారిణికి గాని అలాటి అదృష్టం వుందని అనుకోను.

. భార్యని వొప్పించి తన దారికి తీసుకురా గలిగిన సామర్థ్యం భర్తలో లేని సందర్భంలో, అతనే ఆమె యిష్టాన్ని అనుసరించి ప్రవర్తించడం శ్రేయస్కరం. ఈవిషయం వెంకట్రావూ వొప్పు కుంటాడు. నేను చేసిందికూడా అంతే!

ఒకనెల గడిచింది. అంటువ్యాధిలా నాలో కూడా అంకురించింది ఈబాధ. ముగ్గురం ఒక కూటంలా తయారయాం. ఆఫీసునుంచి రాగానే నేనూ, వెంకట్రావూ, శాంతా వాదప్రతివాదాలు సల్పుతూ వుండేవాళ్లం. తరుచూ— యిద్దరం ఒక వైపూ, మూడోవారు యింకోవైపూ అవుతూవుండే వాళ్లం. కాని, ఏఒక్కమారూ మేం ముగ్గురం ఏకీభవించి నట్లు నాకు జ్ఞాపకం లేదు.

ఇద్దరం ఏకీభవిస్తే తప్పనిసరిగా భేదం పొడసూపేది. నేనూ, వెంకట్రావూ ఒక పక్షమై శాంతని వేరు చేశామా, ఆరోజున ఎంతలేదన్నా, రెండు గాజుకప్పులయినా బద్దలవుతా యన్న విషయం అనుభవపూర్వకంగా తెలుసుకోగలిగాను. అయిదున్నరనుంచి రాత్రి ఎనిమిదిన్నరదాకా వాదించుకునేవాళ్లం.

Sight,, Light., Night ల గురించి వాదించుకొన్న రోజున ముగ్గురివీ మూడు అభిప్రాయాలయిపోయినై. కాంపిటీషన్ మేనేజరు 'క్లూ' కి తెలుగు: 'మానవుడు యిది లేకపోతే జీవించడం దుర్భరం.'

ఏది? Sight Light Night లలో ఏది? Sight, అంటే దృష్టి. Light, అంటే వెలుగు. Night అంటే నిశీథం. ఈ మానవుడు మానవుడిలా బతికేందుకు ఆ మూడూ అవసరమే అంటారు మీరు. కాని, ఆ కాంపిటిషన్ మేనేజరు ఒప్పుకోడు; తను యిచ్చిన 'క్లూ'కి ఈ మూడింటిలోనూ ఏదో ఒకటి మాత్రమే సరిఅయిన జవా బంటాడు.

నేను 'దృష్టి' అన్నాను. శాంత 'వెలుగు' అంది. వెంకట్రావు 'నిశీథం' అన్నాడు. ఈ విషయమై మేము ఎంతఘాటుగా చర్చ జరిపామంటే, మా పక్కింట్లో కాపరం వుంటున్న అయ్యారుగారు మా యింట్లో ఏదో గలాటా జరుగుతోందని పొగాకు నములుతూ పరామర్శించేందుకు వచ్చారు.

అయ్యారుగారు వెళ్లిపోయిన తర్వాత, "మీ కంఠం కంచుగంటలా మోగుతోంది. కొంచెం నెమ్మదిగా మాట్లాడండి." అని శాంత నన్ను వారించింది; వెంకట్రావుని ఏమీ అనలేక.

మళ్లీ వాదప్రతివాదాలలోకి దిగాం.

"'నిశీథం' తప్పు అయితే, యికనుంచి పజిల్స్ సాల్వ్ చెయ్యడమే మానేస్తాను," అంటూ వెంకట్రావు ప్రతిజ్ఞ చేశాడు.

"'వెలుగు' తప్పు అయితే, నేనూ అంతే," అంటూ శాంత మారుప్రతిజ్ఞ ఉత్తరక్షణంలో చేసింది.

నేనుమాత్రం ఏమీ చెయ్యలేదు. చెయ్యలేకపోయాను. కాఫీ మానేద్దామని ప్రతిజ్ఞచేసి, ఆ ప్రతిజ్ఞ నిలుపుకోలేకపోయినప్పటినుంచీ, యింక ప్రతిజ్ఞలు చెయ్యకూడదని ప్రతిజ్ఞ పట్టాను. ఇద్దరూ నన్ను జడ్జిగా ఎన్నుకున్నారు. జీవితంలో నిజంగా ఏ సబ్ జడ్జినో జిల్లా జడ్జినో అయే యోగ్యత లేకపోయినా, ఈవిధంగా జడ్జిని అయానని అనిపించుకున్నాను.

శాంతాదేవి పజిల్స్ అకౌంట్ వేరే 'మెయిన్టెయిన్' చేస్తోంది. ఇప్పటికి రూ. ౧౯-౧౧-౦ ఖర్చు అయింది, రాబడిసున్న. అరసున్న అయినా కాదు నిండుసున్నే!

పాపం! వెంకట్రావు వోడిపోయాడు. శాంతాదేవి నెగ్గింది. 'వెలుగు' రైటయింది. అనన్యసామాన్యమైన ఆమె విజయాన్ని నిజంగా సీసమాలికలలోనే పొగడాలి గాని, ఈ వ్యావహారిక భాషలో వ్రాయడం అంత భావ్యం కాదు. ఆడదానితో పోటీపడి వోడిపోయినందుకు, వెంకట్రావు మనస్సులో చిన్నబుచ్చుకున్నా, పైకిమాత్రం గంభీరంగానే ప్రవర్తించాడు. 'స్పోర్ట్స్‌మాన్'లాగు పజిల్స్ సాల్వ్ చెయ్యడం మానేశాడు. శాంతాదేవికి మాత్రం పజిల్స్ దినదినాభివృద్ధి జెందింది.

పజిల్స్‌లో తప్పులు వస్తున్నకొద్దీ, అదృష్టహీనుణ్ణి అనే నిరాశా, డబ్బు నిష్కారణంగా వ్యయమవుతోందే అనే దిగులూ నాలో ఎక్కువకాగా, శాంతకి ఆశా, ఉత్సాహమూ అపరిమితమయిపోతూ వుండేవి. మొదటిబహుమానం తనకే వచ్చినట్లు ఆమె అప్పుడప్పుడు సరదాగా కలలుకూడా కంటూ వుండేది. ఆ స్వప్నసుఖాన్ని వర్ణిస్తూ మర్నాటి ఉదయం నాకు విపులంగా చెప్పేది.

ఆరు నెలలు గడిచినై.

ఒక శుక్రవారం ఉదయం వెంకట్రావు దగ్గిరికి పదిరూపాయిల చేబదులు అడగడానికి వెళ్లాను. అతను లెక్క చేతిలో పెట్టి, "ఏం, బ్రదర్, పజిల్స్ ఇంకా మానెయ్యలేదూ?" అని అడిగాడు.

"లేదు."

"ఇప్పటికి ఎంత ఖర్చయింది?"

"'పెద్దకాగితం' దాటుతుంది."

"కోడలికి బుద్ధిచెప్పిన అత్తగారి'లాగు ప్రవర్తిస్తున్నావే!!"

"ఏం చేస్తాం. బెటర్ హాఫ్ (Better - half) మాట తోసేస్తే, బిట్టర్ హాఫ్ ((Bitter - half) అయి వూరుకుంటుంది. అంచేత ఏమీ పాలుపోకుండా వుంది."

"నేను చెప్పినట్లు చేస్తావూ?"

"ఊఁ. అంతకంటేనా?"

"ప్రతినెలా ఆరో, ఎనిమిదో ఈ పజిల్స్ కని నిర్దేశించు. అంతకి ఎక్కువ ఖర్చు పెట్టకు."

"నేనేం చెయ్యగలనోయ్, శాంతని వొప్పించాలి."

"పద. మన మిద్దరం కలిసి వొప్పిద్దాం."

మాయింటిదగ్గిర వెంకట్రావు బాతాఖానీ ప్రారంభించాడు. ౧౯౩౦ లోని 'వరల్డ్ డిప్రెషన్'తో మొదలెట్టి, మా యింట్లో 'ఎకనమిక్ డిప్రెషన్' కలుగజేస్తున్న పజిల్స్‌దాకా వచ్చాడు.

"ఆర్థికదుస్థితి యిలా వున్న రోజులలో, ఏమండీ శాంతాదేవిగారూ, మీరు పజిల్స్ కని ప్రతినెలా సుమారు పాతికరూపాయిలు..."

వెంకట్రావుకి వాక్యం ఎలా పూర్తి చెయ్యాలో తెలియలేదు. శాంతాదేవి ప్రబంధకన్యలా కనుకొలకుల్లోనుంచి నావంక చూస్తూ నవ్వింది.

"అవును, శాంతా! పజిల్స్‌కి మనం అంత తగలెయ్యకూడదు," అన్నాను, మిత్రుడి భుజంమీద ఆనుకుంటూ.

శాంత వెంకట్రావుని వుద్దేశించి అంది! "ఏ మండీ, మీ మిత్రులు అంత తగలెయ్యకూడదంటారు; కొంత తగలెయ్యవచ్చుననా వారి ఉద్దేశం ?"

"తగలెయ్యడం ఎంతమాత్రం మంచిదికాదు ... ...కాని... పజిల్స్ కని ప్రతినెలా ఏ ఆరో, ఎనిమిదో..."

" చేకూర్చాలి (Calculative) ", అంటూ శాంత చిలిపితనంగా చిరునవ్వు నవ్వింది.

సహాయాన్ని అర్థిస్తున్నట్లుగా వెంకట్రావు నా కళ్లల్లోకి చూశాడు.

ఇద్దరమూ కలిసి అతికష్టంమీద ఆమె ప్రతినెలా పదిరూపాయలు మాత్రమే పజిల్స్‌కిగాను ఖర్చు పెట్టేటట్లు అంగీకరింపజేశాం.

ఇప్పటికి నూట నలభైరెండు రూపాయిలు ఖర్చయాయి. నేను పజిల్ ప్రపంచంనుంచి పింఛినీ పుచ్చుకున్నాను. శాంతకూడా ఒక వ్రాయని ఫవుంటెన్ పెన్ సంపాదించింది.

ఏనాడో ఒకనాడు, అనుకోకుండానే, ఆకస్మికంగా కొన్నివేల రూపాయిలు వస్తాయని శాంత మనః పూర్తిగా నమ్ముతుంది.

" ఏం, వస్తే రా వచ్చునూ " అంటాడు వెంకట్రావు నన్ను వోదారుస్తూ.

కాని, నేనుమాత్రం శాంతాదేవిచేతిలో అదృష్టరేఖ వున్నా, ధనలాభం కలుసుతుం దని నమ్మలేను; కలగదని నిరాశ పొందలేను...పజిల్...అలాగే అన్నీ పజిల్స్..."

మూలవ్యాధి

"ఒక యోగిపుంగవునిచే ప్రసాదింపబడిన అద్భుతమగు ఔషధరాజము."

రక్తము కారుచున్నను కారకపోయినను, నూతనముగా కలిగినదైనను, చిరకాలమునుండి ఉన్నదైనను పైభాగముననున్నను, లోపలిభాగముననున్నను. ఎట్టిస్థితిలోనున్నను **ఆర్ష-మూర** ఒకసారి పూసినచో అమోఘముగా పనిచేయును. బాధ, దురద, మంట, చీము, నెత్తురుకారుట, వెంటనే ఆగిపోవును. మూడుదినములు వాడినంతనే యెంతటిమొండిదైన మూలశంఖగాని, భగందరముగాని శస్త్రచికిత్స లేకయే పూర్తిగాకుదురును. వేలకొలదిమందిరోగులు ఈమందువలన ఉపశమనముబడసి, తదితరులకు శిఫార్సు చేయుచున్నారు. కుదురకపోయినచో సొమ్ము వాపసు చేయబడును. ఖరీదు రు. 2-0-0.

AROGYA SADAN,

ఆరోగ్యసాధన, దుర్గాదేవి వీధి, బొంబాయి,

రాజమోహన హేరాయిలు

శ్రేష్ఠమయిన సువాసనగల తలనూనె. మెదడుకు చల్లదనమును కలిగించి వెంట్రుకలను అభివృద్ధి చేయుటలో అత్యుత్తమ మయినది.

తలపోటు, కూడుపోటు, శిరోవేడిమి, చుండు మొదలగువాటిని పోగొట్టి కన్నులకు చలవ నొసంగి వెంట్రుకలను మృదువుపరచి, నల్లగా పెంచుటలో అత్యుత్తమ మయినది.

స్త్రీలకు ఆనందమును కలుగజేయును.

సీసా 1-కి రు. 0-12-0 6 సీసాలు రు. 4-4-0

పోస్టేజి ప్రత్యేకము.

వి. శి. ఏం. అండు కంపెని,

ఆయుర్వేదసమాజం,

పెరిదేపి, నెల్లూరుజిల్లా.